# స్నేహితుడు

శ్రీమతి ఆశాలత పాల్

"స్టాఫ్, స్టాఫ్ ప్లీజ్" అంటూ అరుస్తూ వుండగనే బస్సు వదిలేశారు. అక్కడ నుంచున్న స్టేషనుమాస్టరు-

"ఏమయ్యా బస్సు ఎక్కాలంటే రైలునుండి గబగబా దిగలేవా?" అన్నాడు. పాపం కుమార్ అతనికి ఏమి సమాధానం ఇవ్వాలో తెలియలేదు.

"తిరిగి ఎప్పుడండీ బస్సురావడం?" అని అడిగాడు స్టేషన్‌మాస్టర్ని.

అతడు "ఇంకేమి రావడం, ఇదే లాస్టు ట్రెయిను, లాస్టు బస్సుకూడాను. ప్లాటుఫారం మీద పడుకో. రేపు తెల్లవారిఝామునే బస్సు ఎక్కి వెళ్ళుదువుగాని" అంటూ వెళ్ళిపోయాడు. కుమార్ అక్కడనే నుంచోని ఆలోచించడం మొదలుపెట్టాడు. తండ్రికి జబ్బుగా వుందనికదా కాలేజికి సెలవుపెట్టి వచ్చాడు ఈ పల్లెటూరికి పల్లెటూరు స్టేషనునుంచి మూడుమైళ్ళ దూరం. ఒకటేబస్సు తిరుగుతూవుంటుంది. అదికూడా దాటిపోయింది. అక్కడవుండే ఎద్దుబండినిగూడ ఎవరో కట్టించుకుని పోయారు. ఇంకేమి చేసేది? రేపటిదాకావుంటే, తండ్రిస్థితి ఏమవుతుందో? కాని ఈ చీకట్లో ఒక్కడే నడచివెళ్ళడం ఏలాగు? చాలసేపు ఆలోచించి "ఏమవుతే ఏమయింది, నేనువెళ్ళి తండ్రిని చూడకతప్పదు" అనుకొంటూ తన సూటుకేసుపట్టుకొని ఆ చీకటిలో బయలుదేరాడు కుమార్.

నిశ్శబ్దంగావుంది రోడ్డంతాను. పాములకుజడిసి కుమార్ నెమ్మదిగా నడుస్తున్నాడు. ఇలా కొంత దూరం నడిచాక, వెనుకనుండి ఏదో చప్పుడు వినవచ్చింది. "నక్కగాని కాదుకదా!" అనుకొంటూ వెనక్కి తిరిగిచూచాడు కుమార్. కొంత దూరంలో ఒకలైటుఇటువస్తున్నట్టు కనిపించింది. "చచ్చాను దేవుడా! ఈ చీకటిలో ఏగుండా చేతిలోనైనా పడనుగదా! అనుకొంటూ ప్రక్కకి ఒదిగి నుంచున్నాడు. ఇంతలో ఆలైటు దగ్గరికి రావడంమూలాన అదిఒక సైకిలని గుర్తించాడు. ఒక పొడవైనమనిషి ఆ సైకిలుమీద కూర్చున్నాడు. అతని చేతిలోనున్న ఆ లావుపాటి కర్రను చూచేసరికి కుమార్ గుండె దడదడ కొట్టుకోసాగింది ఇంతలో ఆ పొడవైనమనిషి సైకిలునుండి దిగి

"ఎవరుబాబూ మీరు? ఇంత చీకట్లో వేంచేస్తున్నారు?" అన్నాడు. కుమార్ కొంచెం ధైర్యము తెచ్చుకుని

అ, ఏమీలేదు. బస్సు అందకపోతే నడిచి ఇంటికివెళ్తున్నాను" అన్నాడు.

"ఎక్కడండీ మీఇల్లు?"

"ఇక్కడినుండి మూడుమైళ్ళ దూరంలో అక్కడ గ్రామంలో మా నాన్నగారున్నారు. ఆయనపేరు సుబ్బారావుగారు"

"మీరు సుబ్బారావుగారు తాలూకువారా! అయితే రండి. మిమ్మల్ని యింటికి దిబెట్తాను" అంటూ చేయిపట్టుకులాగాడు. కుమార్ చేసేది లేక సైకిలు వెనుక క్యారియరులో ఎక్కికూర్చున్నాడు కొంచెంసేపటికి.

"తమరు పట్నంనుంచి వస్తున్నారా?" అన్నాడు ఆ పొడవైనమనిషి

"ఆ, అక్కడ నేను బి ఏ చదువుతున్నాను. నాన్నగారికి జబ్బుగా ఉందని సెలవుపెట్టి వస్తున్నాను" అన్నాడు కుమార్ యింకా కొంచెం జడుస్తూనే- తరువాత కొంచెం ఆగి,

"నీ పేరేంటి?" అని అడిగాడు-

"నా పేరు యిస్మాయిలు"

"తురక వాడివా"

"కాకపోతే? నాలుంగీచూచి హిందువుననుకున్నారా?" అన్నాడు. కుమార్ తన తెలివి తేటలకు కొంచెం సిగ్గుపడ్డాడు. కొంచెందూరం వెళ్ళాక కుమార్ మళ్ళీ ప్రశ్నలు వేయడం మొదలు పెట్టాడు. అతనికి ఇంకా సందేహము గానేయుంది. ఇంతరాత్రివేళ ఒక్కడే ఎక్కడి నుంచి వస్తున్నాడు? అని తనలో తాను భయపడ్తున్నాడు.

"మీవూరెక్కడ?" అన్నాడు కుమార్.

"మీవూరికవతల గ్రామం. అక్కడ మా ముసలితాత ఉన్నాడు"

"ఇంకెవరూ లేరా?"

"లేకేం! మాఆవిడ ఉందికాని..." అంటూ ఆగాడు.

"ఎందుకు...?" అన్నాడు కుమార్ ఆతృతతో.

"వింటారా?" అని నవ్వాడు ఇస్మాయిల్.

"నీవు చెప్తే వినకేమి?"

"చెప్పడానికి ఏముందిలేండి నాకు పెళ్ళయ్యాక మా తాతా మామగారిని ఉంగరం పెట్టమన్నారు. వాళ్ళుబీదవాళ్ళు. ఎలాగ పెట్తారండి? కొన్నిరోజులయ్యాక ఇస్తామన్నారు. దానితో మాముసలివాడు మా ఆవిడను పుట్టింటికి ఉంగరము తీసుకురమ్మని పంపించివేశాడు. కాని వారిప్పటికీ డబ్బు కుదర్చలేక పోయారు. మా తాత వద్దంటున్నా నేను ఈలాగే దొంగచాటున వెళ్తుంటాను" అని నవ్వాడు ఇస్మాయిల్.

"మీతాతకి తెలుస్తే?"

"ఆ ముసలి వాడికి బాగా నల్లమందు పట్టించే వచ్చాను లెండి"

ఇంతలో సైకిలు కొంచెం ఎత్తుప్రదేశం ఎక్కినట్టు తోచింది కుమార్‌కి. తరువాత అది ఒకబ్రిడ్జిఅని తెలుసుకున్నాడు.

"ఈ బ్రిడ్జిదగ్గర చాలదొంగతనాలు జరుగుతాయని విన్నానే నిజమేనా?" అన్నాడు కుమార్.

"ఆ, అప్పుడప్పుడు జరుగుతుంటాయి లెండి. కాని మీకేమీభయంలేదు. ఈదుడ్డునుచూచారా" అంటూ కర్రని పైకెత్తాడు యిస్మాయిల్. తరువాత

"వెధవలు! ఎందుకు దొంగపనులు చేయడం? అల్లానునిషికి కాళ్ళుచేతులు యిచ్చినపుడు కష్టపడి పనిచేయక" అన్నాడు గర్వంగా.

కుమార్‌ని ఇంటికిదిబెట్టి సెలవు పుచ్చుకున్నాడు ఇస్మాయిలు.

"నీవుచేసిన సహాయానికి నేనేమి యివ్వమంటావు?" అన్నాడు కుమార్.

"ఏమీ అక్కర్లేదు నన్ను ఒక స్నేహితునిగా భావించుకుంటే అదే పదివేలు" అంటూ ఇస్మాయిలో సైకిలెక్కి చీకటిలో అదృశ్యమయ్యాడు

"పాపం! చాలమంచివాడు. ఇంకెప్పుడైనా కనబడ్తే ఏదయినా చేతిలో పెట్టవచ్చు" అనుకుంటూ మెట్లు ఎక్కాడు.

* * *

ఇది జరిగిన ఆరునెలలకు ఒకరోజున కుమార్ చేతిలో పుస్తకము పట్టుకుని గబగబా హాస్టలు వైపుకి వెళ్తూంటే, వెనుకనుంచి.

"బాబుగారూ! బాబుగారూ!!" అంటూ కేకలు వినబడ్డాయి.

"ఏం? ఇస్మాయిల్? నువ్విక్కడికి ఎలాగొచ్చావు?"

"ఒకచీరకొనడానికి మావూర్నుండి వచ్చానండి"

కుమార్ అతనిని హాస్టలుతోటలో కూర్చోబెట్టాడు.

"ఏమిటి విశేషాలు చెప్తే?" అన్నాడు నవ్వుతూ-

"అయితే నామనవి మర్చిపోలేదన్నమాట. నిజంగా మీలాంటి వాళ్ళతో స్నేహం చేయటం నా అదృష్టమండి" అన్నాడు ఇస్మాయిల్ సలాంచేస్తూ-

"దానికేంలే గాని ఎవరికి చీరకొన్నావు?" అన్నాడు కుమార్-

ఎవరికండి- మా ఆడకే ఆవిడను మొన్ననే మాయింటికి తీసుకొచ్చాము"

"ఉంగరం ఇచ్చారా? "

"వారిచ్చేదేమిటి! నేనే ముసలివాడికి తెలియకుండా ఉంగరం కొనియిచ్చాను. వాళ్ళు నాకు దానిని తిరిగి యిస్తే మా ముసలివాడు మామని పొగిడేశాడు." అంటూ నవ్వాడు ఇస్మాయిల్. అది ఇది మాట్లాడినసిదప ఇస్మాయిల్,

"బాబూ-నాకు ఒక బంగారం మొలతాడు కొనిపెట్టాలండి నా కొడుక్కి." అన్నాడు

"నీకొడుకా? సరె కొనిపెడ్తాను. కొని నీకు నచ్చుదేమో! "

"మీరు కొనిపెడ్తే నచ్చక పోవడమండీ? మీకు నచ్చినట్లయితే నాకూ నచ్చినట్లే." అంటూ మొలనుండి డబ్బుతీయడం మొదలెట్టాడు.

"డబ్బు యిప్పుడు అక్కర్లేదు. వారంరోజులు పోయాక వచ్చి నీ మొలత్రాడు తీసుక వెళ్ళు," అన్నాడు కుమార్

వారంరోజులు పోయాక యిస్మాయిల్ రాగానే కుమార్ అతని చేతిలో మొలత్రాడు పెట్టి "నాకు డబ్బుఅక్కర్లేదు. దాన్ని నేను నీ కొడుక్కి బహుమతిగా యిస్తున్నాను"అన్నాడు. ఇస్మాయిల్ సలాంపెట్టి, "బాబు మీరు ఒక సారి నా కొడుకును చూడరా!" అన్నాడు దీనంగా.

"సరేవీలుంటే ఒకరోజు మీయింటికివస్తాను" అన్నాడు.

నాలుగు సంవత్సరాలు గడచి పోయాయి. కుమార్ యిప్పుడు ఉద్యోగం చేస్తున్నాడు. అతనికికూడ ఒక కొడుకు. మొదటి సంతానమని కుమార్ తనకొడుక్కి పుట్టినరోజు మహా వైభవంగా వాళ్ళగ్రామంలోనే చేయదలచుకున్నాడు రేపు పుట్టినరోజు అనగా- అతను తన కొడుక్కి మంచి మంచి బట్టలు, పళ్ళు మొదలైనవి కొన్నాడు. ఆ నాడు సాయంకాలం రైలు ఎక్కి మళ్ళీ స్టేషనులో దిగాడు. ఈ సారి బస్సు కోసం పడిగాపులు కాయవలసిన అక్కర్లేదు ఇప్పుడు స్టేషను మాష్టరుతో అతనికిబాగా పరిచయం ఉంది. ఇంతకుముందే అతని రూంలో యుంచుకొన్న సైకిలుమీద బయలుదేరాడు. అతనికి భయమేయుటలేదు. తన కొడుకుని ఎప్పుడు చూద్దామా అని ఆత్రతతో గబగబా సైకిలు త్రొక్కుతున్నాడు. బ్రిడ్జి సమీపించింది. ఇంతలో అతని ప్రక్కనుండిఏదో శబ్దం వినవచ్చింది. సైకిలునుండి దిగగానే అతని తలమీద ఒక దుడ్డుకర్ర వచ్చిపడింది. బాబోయ్, అని అరిచి సైకిలు వదిలేశాడు అదిదొర్లుకొంటూ బ్రిడ్జిక్రిందకు వెళ్ళిపడింది. ఇంతలో నలుగురైదుగురు వచ్చి అతన్ని చుట్టారు. అందులో ఒకడు,

"ఏముంది, బేగా బయటికితీయి. లేకపోతే అంటూనే అతని రిష్టువాచు లాగేశాడు.

"ఆగండి, నేనన్నీ ఇచ్చేస్తాను ... ఆగండి అంటూ దీనంగా చూచాడు కుమార్,

ఇంతలో ఒకడు అతని ముఖం మీద లైటువేసి గట్టిగా అరచాడు.

దోస్త్! మీరా!

ఇస్మాయిల్! నువ్వా! అంటూ కుమార్ రెండు చేతులతో తలని పట్టుకున్నాడు. ఇస్మాయిల్ తక్కిన వాళ్ళని పంపేశాడు.

బాబు, గట్టిగా తగిలిందనుకుంటాను!

ఛీ! ఛీ! నువ్వునన్ను పలుకరించవొద్దు. ఒకరోజుని నీవే ఈ దొంగలను తిట్టావు జ్ఞాపకముందా? దుర్మార్గుడా. అంటూ కుమార్ ముఖం చిట్లించుకున్నాడు-

బాబు! అల్లాసాక్షి! నేను ఎంత దురవస్థలో నుండి ఈపని చేయజూచానో అల్లాకే తెలుసు!

ముసలివాడు చచ్చినపుడు నాకున్న ఆస్తినంతను పోగొట్టుకున్నాను. ఇప్పుడు నా కొడుక్కి జబ్బుగావుంటే, ఒక మందయినా కొనలేక పోతున్నాను. అంటూ ఏడ్వసాగాడు

అందుకేనా ఈ దొంగతనం మొదలుపెట్టావు. అన్నాడు కుమార్ కఠినంగా

బాబు మీకునా అవస్థేం తెలుస్తుంది నిన్న డాక్టర్ని పిలవడానికి వెల్తే, ముందుడబ్బుయిస్తేనే గాని నీకొడుకును చూడనన్నాడు. అందుకనే ఈ వేళ దినమంతా తిరిగి ఎక్కడా అప్పుదొరకక ఈ పని చేయడానికి ఒక దొంగగా మారాను. కాని, అది మీ తలమీదనే .. అంటూ యిస్మాయిల్ కుమార్ కాళ్ళు పట్టుకున్నాడు. కుమార్ కాళ్ళు విడిపించుకుని నెమ్మదిగా నుంచున్నాడు.

ఇంటికి వెళ్ళగలరా బాబు? నేను సహాయము రానా?

అక్కర్లేదు. నీవు నాలుగు సంవత్సరముల క్రితము చేసిన మేలు నేను మరువలేదు. కాని యిప్పుడు నీ సహాయములక్కర్లేదు.

మీరు అలాగే అంటారా! సరే. సైకిలు తెస్తాను. ఇంటికి వెళ్ళండి. అంటూ బ్రిడ్జిక్రింద నుండి సైకిలు తెచ్చి- "సైకిలు సరిగ్గానే వుంది. నెమ్మదిగా వెళ్ళండి." అని అన్నాడు. ఇస్మాయిల్. తరువాత యిస్మాయిల్ ఏదో ఆలోచించుకొని. బాబు, మీరు నాకొడుకుని చూస్తానన్నారు. వస్తారా? అనిఅడిగాడు. కాని కుమార్ ఒప్పుకోలేదు. ఇస్మాయిల్ చాలసేపు బ్రతిమాలాక సరే, నామాట నిలుపుకుంటాను- అని బయల్దేరాడు అతనితో-

వాళ్ళు యిల్లుచేరుకునేటప్పటికి ఇస్మాయిల్ భార్య, ఇంకకొంతమంది, స్త్రీలు కలిసి గొల్లుమని యేడుస్తున్నారు- ఇస్మాయిల్ పరుగెత్తుకుంటూ యింటికి వెళ్ళాడు. కుమార్ బయట నుంచుండి కళ్ళనీరు పెట్టుకున్నాడు- కొంతసేపటికి ఇస్మాయిల్ అతని కొడుకు శవాన్ని ఎత్తుకుని బయటికి వచ్చి బాబు, మీరు మీ మాట నిలుపు కున్నారా? నా కొడుకుని చూచారా? అంటూ ఏడ్వసాగాడు- కుమార్ కి ఆచనిపోయిన పిల్లవాడివైపు చూడడమే భయమేసింది- తాను ఎంతో ఆశతో నవ్వుతున్న తన కొడుకు ముద్దుముఖము చూద్దామనుకున్నాడు- కాని అదేదో జూన తను చూచేదేమిటి? ఒక చనిపోయిన పిల్లవాని ముఖము- తాను బహుమతిగా యిచ్చిన మొలత్రాడును ఇస్మాయిల్ అతని చేతిలో పెట్టాడు- బాబు మీ అబ్బాయికి పుట్టినరోజన్నారు, నేను యిది బహుమతిగా యిస్తున్నాను- పుచ్చుకోండి- అనిచెప్పి తన కొడుకు శవందగ్గర కూర్చుని ఏడ్వడం మొదలెట్టాడు- కుమార్ ఆ మొలత్రాడును అక్కడే పెట్టేసి, వచ్చేశాడు- ఇస్మాయిల్ అంత యిబ్బందిలో దానిని అమ్మక పోవటానికి కారణం కుమార్ కిచాల ఆశ్చర్యం కలిగించింది- కాని, తాను ఇచ్చిన మొలత్రాడు విలువ యింతేనా?

